సిద్ధం సభతో వైఎస్సార్‌సీపీలో జోష్

అడ్డురోడ్డు తరలివెళ్లిన వేలాది మంది పార్టీ శ్రేణులు



పాయకరావుపేట మండలం నుంచి చిక్కాల రామారావు ఆధ్వర్యంలో బయలుదేరిన నాయకులు

నక్కపల్లి : సిద్ధం సభతో వైఎస్సార్‌సీపీలో జోష్ వచ్చింది. సోమవారం అడ్డురోడ్డులో జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి బహిరంగ సభకు నాలుగు మండలాల నుంచి వేలాది మంది అభిమానులు తరలి వెళ్లారు. జై జగన్, మేము సిద్ధం అంటూ కార్యకర్తలు, నాయకుల నినాదాలతో పాయకరావుపేట నుంచి అడ్డురోడ్డు వరకు జాతీయ రహదారితో పాటు, కోటవురట్ల నుంచి అడ్డురోడ్డు వరకు ఉన్న నర్సీపట్నం రోడ్డు కార్యకర్తల వాహనాలతో నిండిపోయింది. మారు మూల గ్రామాల నుంచి సయితం కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు తరలిరావడం విశేషం. మరో 60 రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఈ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గొల్లబాబూరావును రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేసి ఆయన స్థానంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులను సమన్వయకర్తగా నియమించారు. అలాగే పార్టీ నేతల మధ్య ఉన్న చిన్నపాటి మనస్పర్ధలను తొలగించి ఏక తాటిపైకి తీసుకువచ్చి పచ్చ పార్టీలను దీటుగా ఎదర్కొనేందుకు గాను దిశానిర్దేశం చేసేందుకు ఈ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి అమర్నాథ్, ఎమ్మెల్యే, ఎంపీ, సమన్వయకర్తలు ఈ సభకు హాజరై పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. సిద్ధం అనే నినాదం కార్యకర్తల్లో బాగా చొచ్చుకుపోయింది. అభిమానులంతా తాము సిద్ధం అంటూ నినాదాలు చేసారు. సభలో మాట్లాడిన నాయకులంతా వచ్చే ఎన్నికల్లో పెత్తందార్లతో యుద్ధానికి మీరు సిద్ధమేనా అంటూ ప్రశ్నించడంతో సభకు హాజరయిన కార్యకర్తలంతా తాము సిద్ధమేనంటూ చేతులు పైకెత్తి నినాదాలు చేశారు. నక్కపల్లి మండలం నుంచి కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు లొడగల చంద్రరావు నేతృత్వంలో వందలాది మంది అడ్డురోడ్డు సభకు తరలి వెళ్లారు, వీరిలో ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పాపారావు, మణిరాజు, తాతబాబు, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, సింహాచలం బోర్డు సభ్యురాలు శేషారత్నం పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తరలి వెళ్లారు.

సిద్ధం సభకు భారీగా తరలిన నేతలు

పాయకరావుపేట : నియోజకవర్గంలో ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సిద్ధం సభకు మండలం నుంచి పార్టీ నాయకులు భారీగా తరలివెళ్ళారు. ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో బైక్‌ల పైన, ఆటోల పైన నాయకులు సభకు బయలుదేరారు. సభకు బయలుదేరిన వారిలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ జిల్లా కార్యదర్శులు కోడ కోటేశ్వరరావు, యజ్జల అన్నవరం, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవవరపు రాజేష్ ఖన్నా, కె.సుందరీలత, మంగవరం, సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట, కేశవరం, రాజగోపాలపురం, కందిపూడి సర్పంచ్‌లు వంగలపూడి రామారావు, సకిలేటి రాము, పన్నీరు బాబ్జి, చేపల నాగమణి తాతాజీ, మేడిశెట్టి రామగోవిందు, యన్నంరెడ్డి లోవరెడ్డి, పందిరి ధర్మాజీ, ఎంపిటిసిలు యగదాసు శేఖర్, కొంతం నరేష్, నీలాపు మహేష్‌రెడ్డి, తమ్మిర్సి సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షుడు గురుజు గోవిందరెడ్డి, బిసి సెల్ అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మహిళా విభాగం సభ్యులు బొడ్డా శ్రీదేవి, కొంతం వరలక్ష్మి తదితరులు వెళ్ళారు. పట్టణం నుంచి ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు ఆధ్వర్యంలో కూడా పట్టణం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, సీనియర్ నాయకులు దేవవరపు సూర్యచక్రం, మత్స్యకార నాయకులు మైలపల్లి అశోక్, ధనిశెట్టి బుజ్జి, కేశనకుర్తి సత్తిబాబు, పట్టణ ఏస్సీ సెల్ అధ్యక్షులు డి.నానాజీ, తదితరులు ఆటోలు పైన, బైక్‌లపైన తరలివెళ్లారు.

మేము సిద్ధం అంటూ అడ్డురోడ్డుకు..

కోటవురట్ల: ఎన్నికల సమరానికి సై అంటూ మండలం నుంచి అడ్డురోడ్డులో జరుగుతున్న సిద్ధం సభకు భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి వెళ్లారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి పార్టీ ముఖ్యనాయకులు, సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో కార్యకర్తలు నాయకులు బైకులపై తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా, మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, యువజన విభాగం కార్యదర్శి చామంతుల శ్రీనివాసు తరలివెళ్లారు.



కైలాసపట్నం నుంచి సిద్ధం సభకు తరలివెళుతున్న నాయకులు



నక్కపల్లి నుంచి తరలి వెళ్తున్న నేతలు, కార్యకర్తలు

సంక్షేమం,అభివృద్ధికి సమప్రాధాన్యం

- ఎమ్మెల్యే కన్నబాబు
- పురుషోత్తపురంలో సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, వైస్ ఎంపీపీ రాజాన శేషు

యలమంచిలి రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. సోమవారం సాయంత్రం యలమంచిలి మండలం పురుషోత్తపురంలో రూ.5 లక్షల ఎంపీల్యాడ్స్ నిధులతో యాతపేటలో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక భవనాలతో గ్రామాల్లో ప్రజల సామూహిక అవసరాలు తీరుతాయన్నారు. శుభకార్యాలు, కుల సమావేశాలకు సౌకర్యవంతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. త్వరలో జరగనున్న తాళ్లమాంబ అమ్మ వారి పండగకు దూర ప్రాంతాలనుంచి వచ్చే యాత్రికులకు వసతి కల్పించడానికి నూతన సామాజిక భవనం ఉపయోగపడుతుందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజాన శేషు అన్నారు. సామాజిక భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతికి ఆయన గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ , ఎంపీపీ గోవింద్, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లి దుర్గాప్రసాద్, యాత సామాజికవర్గం పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి

మునగపాక : ఉపాధిహామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో ఎరకయ్య కోరారు. మండలంలోని తిమ్మరాజుపేట సచివాలయంలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రహదారు లు, డ్రైన్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ పథకంలో పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, సచివాలయ కన్వీనర్ రామభద్రరావు నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు



మునగపాకలో బ్లీచింగ్ పిచికారీ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : మునగపాకలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం బ్లీచింగ్ పిచికారీ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల ముందు నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. అలాగే దోమల నివారణకు పాలక వర్గం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ప్రజలు గ్రామాభివృద్ధికి సహకరించాలని అప్పారావు కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలపై అవగాహన



గంగాదేవిపేటలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక : మండలంలోని మూలపేట శివారు గంగాదేవిపేట పోలింగ్ కేంద్రంలో సోమవారం ఈవీఎంల్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ప్రజలకు ఈవీఎంలు అలాగే వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా ఆర్ఐ కిషోర్ ఓటు వేసే విధానంతో పాటు పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రీ-సర్వే డీటీ పడాల్, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా ప్రతాప్



మునగపాక : మునగపాక గ్రామానికి చెందిన బద్దెం ప్రతాప్ విశాఖపట్నం టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర టెలిఫోన్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. బీజేపీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతాప్ శక్తివంచన లేకుండా కృషి చేశారు. ప్రతాప్ సేవలను గుర్తించిన పార్టీ టెలికాం అడ్వయిజరీ సభ్యునిగా గుర్తించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పదవికి న్యాయం చేస్తానని ప్రతాప్ తెలిపారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న కార్మికులు

రాంబిల్లి: తమకు కనీస వేతనాలు ఇతర అలవెన్సులు, సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నేవీ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ కార్మికులు నిరసన, ధర్నా చేశారు. నేవీ మెయిన్‌గేట్ వద్ద నినాదాలు చేస్తూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. కనీస వేతనాలు, వైద్యం, భోజనం వంటి సదుపాయాలు నిబంధనల మేరకు అందజేయాలని కార్మికులు నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ అప్పలస్వామికి, సీఐ లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శంకర్రావు, దేముడునాయుడు , కార్మికులు పాల్గొన్నారు.



అడ్డురోడ్డులో సిద్ధం సభలో మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి తదితరులు

అనిత ఆశలపై గెడ్డం బుజ్జి నీళ్లు

నక్కపల్లి : మద్దతు కోసం వెళ్లిన పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగల పూడి అనితకు జనసేన సీనియర్‌నేత, కాపు నాయకుడు గెడ్డం బుజ్జి షాక్ ఇచ్చారు. అనిత ఆశలపై నీళ్లు చల్లారు. మీపై మాకు నమ్మకం లేదు.. తీరా గెలిచిన తర్వాత గతంలో మాదిరిగా మాపై కేసులు పెట్టడం, మమ్మల్ని, జనసేన కార్యకర్తలను పట్టించుకుంటారనే గ్యారంటీ ఎమిటని ప్రశ్నించారు. పాయకరావుపేట టీడీపీ అభ్యర్థిగా వంగలపూడి అనితను ప్రకటించిన విషయం తెలిసిందే. పొత్తు ధర్మంలో భాగంగా ఆదివారం అనిత నాలుగు మండలాలకు చెందిన పార్టీశాఖ అధ్యక్షులను, కొంతమంది ముఖ్య నాయకులను తీసుకుని గుంటపల్లిలో గెడ్డం బుజ్జి ఇంటికి వెళ్లి మద్దతు ఇవ్వాలని ఉమ్మడి అభ్యర్థిగా తన గెలుపునకు సహకరించాలని కోరారు. దీనిపై గెడ్డం బుజ్జి స్పందిస్తూ 2014లో జనసేన మద్దతుతోనే ఇక్కడ ఎమ్మెల్యేగా విజయం సాధించిన మీరు వెంటనే తనపై కేసులు బనాయించారని, తన ఆస్తులపై సిట్‌కు ఫిర్యాదు చేశారని, జనసేన కార్యకర్తలను ఇబ్బంది పెట్టడంతోపాటు, వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వలేదని అన్నారు. మళ్లీ గెలిపిస్తే అలా చేయరనే గ్యారంటీ ఏంటంటూ నిలదీశారు. ఇరు పార్టీలకు చెందిన రాష్ట్ర నాయకులు నియోజకవర్గంలో టీడీపీ, జన సైనికులతో సమావేశం ఏర్పాటు చేయాలని, అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవుల్లో గాని, ఇతర లబ్ధి కలిగే అంశాల్లో తగిన ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇస్తేనే ఇక్కడ టీడీపీ గెలుపునకు పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇటువంటి హామీ పార్టీ పెద్దల నుంచి వచ్చే వరకు మద్దతు విషయమై హామీ ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పారు. తమ పార్టీ తరఫున అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న నాగబాబు సమక్షంలో ఒప్పందం జరగాలని బుజ్జి స్పష్టం చేశారు. దీంతో మద్దతు కోసం మంది మార్బలంతో వెళ్లిన అనితకు ఆ పార్టీ నుంచి వచ్చిన స్పందన మింగుడు పడడం లేదు.



మద్దతు కోసం జనసేన నేత గెడ్డం బుజ్జిని కలిసిన అనిత

వలంటీర్లకు సత్కారం



తిమ్మరాజుపేటలో వలంటీర్లకు సత్కారం నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: వలంటీర్ల సేవలు అభినందనీయమని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం తిమ్మరాజుపేట వలంటీర్లకు సత్కారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధిగా సేవలందిస్తున్నారన్నారు. తమకు కేటాయించిన 50 కుటుంబాలకు చెందిన ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, సచివాలయ కన్వీనర్ రామభద్రరావునాయుడు, వార్డు సభ్యుడు జగన్‌మోహన్‌రావు,పీఏసీఎస్ డైరెక్టర్ ఆడారి గణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ ప్రజావేదిక రేపు..

రాంబిల్లి : సోషల్ ఆడిట్ ప్రజావేదిక సభను ఈ నెల 28న రాంబిల్లిలో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో వెంకటాచలం, ఏపీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 30 పంచాయతీల పరిధిలో సామాజిక తనిఖీలు నిర్వహించి గ్రామసభలను నిర్వహించడం జరిగిందన్నారు. మండల స్థాయిలో బుధవారం ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. రూ.6.15 కోట్లు విలువైన 814 పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ ప్రజావేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బదిలీ అయిన డిప్యూటీ తహసీల్దార్‌కు వీడ్కోలు సత్కారం



బదిలీపై వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్‌ని సత్కరిస్తున్న మండల రెవెన్యూ సిబ్బంది

ఎస్.రాయవరం : మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉత్తమ సేవలందించిన శ్యామ్‌కుమార్‌ను సోమవారం ఘనంగా రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. ఉద్యోగ రీత్యా బదిలీలు సర్వసాధరణమేనని మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడు ఆర్.నూకరాజు అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బదిలీల్లో భాగంగా మండల డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్‌కి నర్సీపట్నం బదిలీ అయ్యింది. ఈ మేరకు మండల వీఆర్వోలు , రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణమూర్తి,ఈవోపీఆర్డీ సత్యనారాయణ, మండల సర్వేయర్ శ్రీమూర్తి, పలువురు వీఆర్వోలు, మండల డీలర్ సంఘ అధ్యక్షుడు అప్పారావు తదితరులు ఉన్నారు.

విజయదుర్గమ్మకు దొరైస్వామి విరాళం

అచ్యుతాపురం : హరిగిరిపై వెలసిన విజయ దుర్గమ్మ వారికి బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి రూ.లక్షా వేయి నూట పదహార్లు విరాళం సోమవారం అందజేశారు. దొరస్వామి తన సొంత నిధులతో ఈ విరాళాన్ని అందజేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన దొరైస్వామికి ఆలయ వర్గాలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మారిసెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ, మారిసెట్టి వెంకట సీతారాం, శరగడం లక్ష్మీ జ్యోతిర్మయి ప్రసాద్, శరగడం అప్పలనాయుడు, పెంటకోట నాయుడు, వర, రాము పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

యువత దేశభక్తిని అలవర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముర్రు ముత్యాలనాయుడు

అచ్యుతాపురం : యువత దేశభక్తిని అలవర్చుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వపు ఉపకులపతి ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నైబర్‌హుడ్ పార్లమెంట్‌లో భాగంగా ఆయన మట్లాడారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి గొర్లె మహేశ్వరరావు కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరించారు. బార్క్ సైంటిస్ట్ ఎం.వి సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

యలమంచిలి : యలమంచిలి మండలం షేకిళ్ల పాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా షేకిళ్ల పాలెం గ్రామంలో సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ బోదెపు గోవింద్ ప్రారంభిస్తారని, సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు తమ ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకోవాలని వైద్యులు ద్వారా పలు వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయించుకుని ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న మందులను పొందాలని వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



మునగపాక : మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్స వం సోమవారం ఘనంగా జరిగింది. అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. తెల్లవారు నుంచి అయ్యప్పను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చెర్లోపాలెంలో నేడు పాదాలతల్లి పండగ

మునగపాక : మండలంలోని చెర్లోపాలెంలో మంగళవారం పాదాల తల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరుండడంతో దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు రానున్నారు. ఇందుకు సంబంధించి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

పరిశ్రమ కాలుష్యంపై ఫిర్యాదు

అచ్యుతాపురం : అచ్యుతాపురం సెజ్ పరిధిలోని ఏపీటీఎల్ నుంచి విడుదల అవుతున్న కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని ఏపీపీసీబీ జోనల్ మేనేజర్ త్రినాథ్‌కు పూడిమడకకు చెందిన పలువురు సోమవారం వినతి పత్రం అందజేశారు. చోడపల్లి అప్పారావు, మేరుగు అప్పలనాయుడు తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.



జోనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకారులు

దేవాలయ భూములను రక్షించాలి

రాంబిల్లి : పంచదార్ల రెవెన్యూ పరిధిలో గల దేవాలయ భూములు , ప్రభుత్వ భూములను పరిరక్షించాలని అప్పారాయుడుపాలెం గ్రామానికి చెందిన నానేపల్లి సన్యాసిరావు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రీ సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బందిని అక్రమార్కులు తప్పుదోవ పట్టించి ఆయా భూములు పక్కదారి పట్టేలా చూస్తున్నారని దీనిపై సమగ్ర విచారణ చేయాలని సన్యాసిరావు కోరారు. విచారణ తర్వాతే రీ సర్వే చేయాలని ఫిర్యాదు చేశారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

మునగపాక: మునగపాకలో నీటిపారుదల శాఖకు సంబంధించిన కాలువ ఆక్రమణపై అధికారులు సోమవారం స్థలం పరిశీలించారు. కొంత కాలంగా ఆక్రమణకు సంబంధించి రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా డీటీ వినయ్, ఎస్ఐ ప్రసాదరావులు వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు అక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



కశింకోటలోని శివాలయంలో నిర్వహిస్తున్న అన్న సమారాధన

కశింకోట: కశింకోటలోని సర్వ మంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామిని పూలతో అందంగా అలంకరించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం శివ సన్నిధి గ్రూపు తరపున పేదలు, భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

పూడిమడకలో జాతర సందడి



దుకాణాల వద్ద జనాల సందడి

అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక వద్ద మాఘపౌర్ణమి జాతర సందడి కొనసాగుతోంది. పౌర్ణమి స్నానాలు ముగిసిన వారం రోజుల వరకూ తీరం వద్ద దుకాణాల సందడి ఉంటుంది. ఈమేరకు సోమవారం కూడా పూడిమడక తీరం వద్ద వస్తువుల మార్పిడి సంత కొనసాగింది. ఇది ఎన్నో దశాబ్దాల నుంచి కొనసాగుతున్న సంప్రదాయం కావడం విశేషం.